
# భూపాలరాగం

పి. సత్యవతి



ఎన్నోసార్లు తెల్లవారినట్లే మళ్ళీ తెల్లవారింది అందరికన్న ముందు మాణిక్యానికి —

దాని మొగుడు అప్పటికే పందుంపుల్ల నమిలి కాండ్రించి ఉమ్మేస్తున్నాడు.

"లెగెహే! ఎదవ మొద్దు నిద్దరా నువ్వూనూ- తెల్లగా తెల్లారిపోనాది" అని విసుక్కుంటున్నాడు.

నిజానికి తెల్లగా తెల్లవారనేలేదు. వెలుగు రేకల్ని ప్రసరించడానికి చీకటి ప్రసవవేదన పడుతున్న వేళ—

రిక్షాబండి లాగే మొగుడికి తెల్లవారు ఝామునే ఇంతకూడు ఉడకేసి పడేసి పాచి పనికి పోతుంది మాణిక్యం. పని చేసేచోట ఇచ్చే కాఫీ, ఫలహారంతోనూ, చద్దిఅన్నం తోనూ, దానిపొట్ట గడుస్తుంటుంది. మొగుడికీ. కొడుక్కీ- వండి పడేస్తుంది.

మాణిక్యం పొయ్యి రాజేసి. అన్నం వండి మూడురోజులైంది—

మూడు రోజులనుంచీ క్యూలో నిలబడ్డా బియ్యం దొరకలేదు - బయట బియ్యం ధర ఆకాశం ఎక్కి- కూర్చుంది.

కొడుకుని క్యూలో నిలబెడితే ఎవరో తోసేసినారని ఏడ్చుకుంటూ తిరిగి వచ్చాడు.

అమ్మగారింట్లో తినే తెల్ల బియ్యంఅన్నం- వాళ్ళ ప్లేట్లలో పారేసే తెల్లటి కరుళ్ళు- కళ్ళల్లో మెదిలాయి. తూముల్లో అన్నం మెతుకులు- ఒక్క- బియ్యం గింజ పుట్టక అల్లాడే తనలాంటోళ్ళు! ఏ జన్మలో చేసిన పాపమో ఏమిటో! మహారాజులు ఎంత పుణ్యం చేసినారో! డబ్బులు, బియ్యం అన్నీ కలిసినా చేత రాలేదు- చేత బియ్యం ఒకపిడికెడు- రిక్షా లాగితే వచ్చేది ఐదారు రూపాయలు- అందులో త్రాగేదానికో మూడో రెండో- వాడికిష్టమైతే సాయంత్రం తన కోసం కాసిని మిరపకాయ బజ్జీలూ, ఇన్ని మల్లెపూలూ తెస్తాడు. లేకపోతే. "ఏ పూటా, ఈ పచ్చడి మెతుకులేందే - ఎదవ లంజా" అని మక్కెలిరగ తంతాడు.

అంట్లు తోమి - బట్టలుతికి చేతులు

బండబారి పోయినాయి -- దెబ్బలు తిని, మనసూ బండబారిపోయింది.

ఏంటో ఆలోచించినకొద్దీ మతిపోతుంది. ఆ మసక వెలుగులోనే తల దువ్వుకుని. చీరె బిగించి కట్టి జర్మన్ సిల్వర్ టిఫిన్ చేత బట్టుకుని. "మరినాను వెళ్ళొస్తా" అని గుమ్మం దాటింది మాణిక్యం.

మాణిక్యంకన్న ఓ అరగంట ఆలస్యంగా తెల్లవారింది రుక్మిణమ్మకి.

రుక్మిణమ్మకి తెల్లవారకుండా వుంటే బాగుండుననిపిస్తుంది.

ఆమె పడుకున్న నవారు మంచం నిండా ముళ్ళున్నాయి. దానిమీద వేసిన బొంత పిల్లల మూత్రంతో తడిసీ – ఎండీ-ఎండీ తడిసీ – ఒక విధమైన వాసననీ – కరుకుతనాన్నీ సంతరించికుంది. ఆ వాసనకీ, ఆ కరుకుతనానికీ రుక్మిణమ్మ అలవాటు పడిపోయింది. అందుకే ఆ ముళ్ళ నవారు మంచం మీదనుంచీ, ఆ బొంతమీద నుంచీ లేవడానికి ఆమెకి మనసొప్పదు – అయినా ఆవిడ అలా ఎంతసేపోదానిమీదపడుకోదు. తెల్లవారగానే పాలు కాచి పిల్లవాడికి సిద్ధం చేయాలి. డికాక్షన్‌తీసిభర్తగారికికాఫీఅందించాలి. బాయిలర్ అంటించి పిల్లలకినీళ్ళుతోలిచి బడికిపంపాలి. ఈలోపలవచ్చేపోయే కూరగాయలవాళ్ళకి, అప్పారావులకి సమాధానాలు చెప్పాలి – పిల్లల అలకలు తీర్చాలి– వీలుంటే పిపుమీద రెండు అంటించాలి– పనిమనిషిమీద అరవాలి – భర్తని సాధించాలి–తన దురదృష్టానికి చింతించాలి–సుఖపడుతూన్నవాళ్ళ అదృష్టానికి అసూయపడాలి – కట్నానికి లోభించి గుమాస్తా మొగుడికిచ్చి చేసిన తల్లిదండ్రులను సాధించాలి–ఒకటేమిటి రుక్మిణమ్మకి నోటినిండా, చేతినిండా పని.

అప్పో, సప్పోచేసి గాస్‌పొయ్యి కొనిపడేశాడేగానీ, గాస్ అయిపోగానే సిలిండర్ తెచుకోడానికి చేతిలో డబ్బుండదు– జీతం వచ్చేదాకా ఇంటినిండా వెధవ బొగ్గు పసీ-కిరసనాయిల్ వాసనా. ఆదివెవరో వ్రాసిన సీరియల్ నవల సినీమా తీశారు. వస్తూంది వస్తూందని వెయ్యికళ్ళతో ఎదురుచూస్తే రానూ వచ్చింది. పోవడానికి సిద్ధంగావుంది. సాయంత్రం పాత పేపర్లు అమ్మింవైనా చూసి తీరాలి-వెధవ సంసారం– బండ చాకిరీనూ– హాయిగా ఎస్సెల్సీ పాసవగానే ట్రెయినింగ్ చదివినా స్వతంత్రంగా నాలుగు డబ్బులు సంపాయించుకునేది. తనకన్నా మాణిక్యం నయం. దాని మొగుడు సంపాయిస్తాడు – అదీ సంపాదిస్తుంది. కొడుకూ సంపాదిస్తాడు. ఎవరి డబ్బులతో వాళ్ళు సినీమాలు చూస్తారు. తనికి పాపలా కావాలన్నా మొగుడు మహారాజు ధర్మం చేయాల్సిందే. వెధవ బ్రతుకు! చంటిదానికి నాలుగు రోజులున్నుంచీ ప్రక్కలు వెచ్చబడుతున్నాయి. హోమియోపతీ మందుల్తోనూ, కస్తూరీ మాత్రల్తోనూ తగ్గవు ఈ రోగాలు– పాతిక రూపాయలు వదలాల్సిందే.

"పిల్లదాన్ని హాస్పిటల్‌కి తీసుకు వెళ్ళాలి– డబ్బులేదు–" అంటే–

"అదేమో నాకు తెలీదు – జీతంఅంతా నీ చేతిలోనే పోస్తున్నా. నాతో చెప్పడం ఎందుకూ?" అంటాడు భర్త–ఈ కాలం ఆడవాళ్ళకి ఇదొక బాధ– చాలీ చాలని జీతం ఎవరిచేతులోవున్నా ఒకటేగదా!

సైకిల్ టైర్లు అరిగిపోయి చిల్లులడిపోయాయి– కొందామంటే మార్కెట్‌లోలేవు. చచ్చినట్లు ఆఫీసుకి నడిచి వెడుతున్నాడు పాపం అతను. క్యూల్లో నిలబడి తెచ్చుకునే వాళ్ళకి రూపాయికి బియ్యం వస్తాయి – నిలబడడానికి తీరికాలేదు. ఆ బియ్యం రుచించవు. బియ్యం కొట్టువాడు అప్పు ఇవ్వనంటాడు. అన్నట్లు బియ్యం గవర్నమెంటువారు పంచుతారట ఇకనుంచీ – పంచదారలాగే ఇవి కూడా బ్లాకులో బోలెడు డబ్బులెట్టి కొనుక్కోవాలి గావును.

రుక్మిణమ్మకి జీవితం చాలా చప్పగా, మహా బోర్‌గా అనిపిస్తోంది. ఎండిపోయిన కాలవలాగ, ఆకులు రాలిపోయిన చెట్టులాగ ఎలాగో అనిపిస్తోంది. బ్రతుకులో తడియిగిరి పోయినట్లనిపిస్తోంది.

మళ్ళీ పొద్దు గుంకడం కోసం మళ్ళీ ముళ్ళ నవారు మంచంమీద వాలడంకోసం ఆవిడ ఎదురు చూస్తుంది తెల్లవారినప్పటి నుంచీ.

రుక్మిణమ్మ కన్న మరికాస్త ఆలస్యంగా తెల్లవారింది వకుళకి.

ఈ మధ్యన నిద్ర బాగా పడుతోన్నట్లే వుంది. ఈ ప్రపంచం యావత్తు ఇలా నిలబడడానికి కారణం–దీని అడుగున రూపాయి నాణెం ఆధారంగా వుండి వుండడమేననే సత్యాన్ని గ్రహించింది వకుళ.–

కాలేజీలో నుంచి బయటబడి, రెండేళ్లు ఇంట్లో వున్నప్పుడు ఆమెకి చాలా సత్యాలు తెలిశాయి. తెలుగు నవలా రచయిత్రులు కొందరు చిత్రించినట్లు ఆడపిల్ల ఎంత అందంగావున్నా–అరడుగుల ఎత్తుగా ఠీవిగా వుండి. పెద్దఉద్యోగంచేసే పురుష పుంగవుడెవరూ ప్రేమించి పెళ్ళిచేసుకోడు–అసలు నవలల్లో, సినీమాల్లో పుట్టినంత త్వరగా అద్భుతంగా జీవితంలో ప్రేమ పుట్టదు– పోనీ– అమ్మకీ– అమ్మమ్మకీమల్లే అరేంజిడ్ మ్యారేజ్ చేసుకుందామనుకున్నా– ఆ మ్యారేజ్ అరేంజ్ కావడంకూడా చాలా కష్టమే ఈఅందం– ఈచదువూ–ఇవేవీకావు పెళ్ళికిక్వాలిఫికేషన్లు–పెళ్ళిఖరీదుఇరవై వేలు మెగాడ్–ఏవి ఇరవై వేలు ??– "ఇరవై వేలుంటే క్రొత్త కారు కొనుక్కొని హాయిగా తిరిగవచ్చు – పెళ్ళికొడుకుని కొనుక్కొని అగచాట్లు పడ్డంకన్న–" అనేది క్లాస్‌మేటు వనజ ఇటీజ్ రియల్లీ ట్రూ పోనీ పెళ్ళికన్న జాబ్ మేలేమో చూద్దాం – అనుకుంది –

ఏదో అమ్మ పినతల్లి కొడుకు తోడల్లుడి తమ్ముడి బావమరిది–మినిష్టర్ దగ్గర అంతరంగిక సలహాదారుగా వుండేవాడు గనుక– ఈ మాత్రం ఉద్యోగం దొరికింది –

ఫరవాలేదు. ఈ మాత్రం ఉద్యోగం సామాన్యమా దొరకడం. నెలకి నాలుగు వందలు! మూడు వందలు దాచుకున్నా నాలుగేళ్ళల్లో పెళ్ళికొడుకుని కొనుక్కోవచ్చు అనుకుంది వకుళ. కానీ ఆ నెల జీతం అందుకుని ఇంట్లో ప్రవేశించగానే మూడు వందలు కాదుకదా – వంద కూడా బ్యాంకులో వేయడం కుదరదని తెలిసిపోయింది. రెండేళ్ళైనా రెండొందలు మిగల్లేదు.

వకుళకీ వయసుంది – మనసూవుంది – కోరికలున్నాయి – అవి తీరే అవకాశం లేదు. ఈ దేశంలో పెళ్ళి కాకుండా కోరికలు తీర్చుకుంటే అది మహాపాపం. పెళ్ళి చేసుకోడం ఎలాగ? ఉద్యోగం దొరికిన సంతోషం కాస్త ఉష్మని ఎగిరిపోయింది.

లోకంమీద వెన్నెల కురుస్తూ వుంటుంది తోటల్లో మల్లెపూలు విరబూస్తాయి– కోయిల కూస్తుంది. శీతాకాలం చలి వేస్తుంది. సాయంత్రంవేళ దంపతులు షికారు వెడుతూ వుంటారు. పొరుగింటి పసిపాప ముద్దు ముద్దుగా పిలుస్తుంది. శరీరంలో కోరికలు బుస్సున ఎగిసి విరిగిపడిపోతాయి– చల్లుకి పోతాయి.

ఎన్నాళ్ళిలాగ? ఎన్నేళ్ళిలాగ?

ఫ్రీడమ్ ఆఫ్ సెక్స్ తప్పు–

సినీమాల్లో–పుస్తకాలల్లో– ఎడ్వర్‌టైజ్‌మెంట్లలో ఎక్కడ చూసినా, నరాలు వేడెక్కించే సెక్స్ దృశ్యాలు వుండవచ్చు. కానీ వయస్సులో వున్న మనిషి హృదయంలో కోరిక జనించడం తప్పు – దానికి "పెళ్ళి" అనే లైసెన్సు కావాలి. లైసెన్సు

ఓపెన్ మార్కెట్టులో దొరకదు- బ్లాకులో దాని ఖరీదు ఆకాశమంత-

తీరని కోరికలు అసంతృప్తిని రేపుతున్నాయి- చిరాకు. కోపం- సంపాదించి పెడుతున్నాననే గర్వం - సుపీరియారిటీ కాంప్లెక్సు - మళ్ళీ అందులోనే నిస్పృహ యత, నీరసం-

కిటికీ దగ్గర మంచంమీద పడుకుని ఆకాశం కేసి చూస్తూ రాత్రులెన్నో గడిచి పోయాయి-

ఆ రాత్రి తెల్లవారి పోతుంది-తెల్లవారక పోతే బాగుండును అనుకోదు పకుళ- త్వరగా తెల్లవారితే రొటీన్‌లో జొరబడితే ఆమెకి కొంత శాంతి కలుగుతుంది-

అందరికన్న ఆలస్యంగా తెల్లవారేది మిసెస్ సుగుణా సుబ్రహ్మణ్యానికి.

రాజుకి ఇరవైనాలుగు గంటలు చాలవు- కనీసం ముఫైఆరు గంటలైనా వుండాలి. రాత్రి పన్నెండింటికి పడుకుంటే తొమ్మిదింటికే తెల్లవారి పోతుంది. ఇంక నిద్ర రాదు. తొమ్మిది గంటల నిద్రేం చాలుతుంది అనిపిస్తుంది ఆవిడకి.

అప్పటికే కొడుకూ కూతురూ బ్రేక్‌ఫాస్ట్ చేసి స్కూల్‌కి వెడతారు. మిస్టర్ సుబ్రహ్మణ్యంకి ఇంకో అరగంటకికానీ తెల్లవారదు. ఇంకా ముందు లేస్తే ఆయన హాంగ్ ఓవర్‌కి తట్టుకోలేడట - పాపం. ఏం ఉద్యోగమో, ఏం సంపాదనోకానీ కంటినిండా నిద్ర- కడుపునిండా తిండీ వుండడంలేదు- లిక్కర్ తప్ప-

మిసెస్ సుగుణా సుబ్రహ్మణ్యం ఫోమ్ బెడ్‌మీద నుంచి బద్ధకంగా ఆవులించి లేచింది- అద్దం ముందు నిలబడి తల దువ్వుకుంది- ముఖానికింత పౌడరు పేసుకుని బ్రష్ తీసుకుని బాత్‌రూంకి బయలుదేరింది.

వంట మనిషి అప్పటికే డైనింగ్ టేబిల్ మీద కాఫీ కప్పు పెట్టేసి వెళ్ళిపోయింది-

ఫోన్ మ్రోగుతోంది-

ఆర్డర్లీ జవాబు చెబుతున్నాడు. "ఇంకా లేవలేదండీ- అమ్మగారి మాటే చెప్పేది - ఇంకా పదేనా కాలేదు - అప్పుడే ఎక్కడండీ లేచేది-" వాడి గొంతులో విసుగు.

వరండాలో పేముకుర్చీల నిండా మనుష్యులున్నారు. డ్రాయింగ్ రూంలో, సోఫాలో కొంతమంది-చూసీ చూడనట్లు అందర్నీ చూసింది.

చివరి సోఫాలో కూర్చున్న నల్లటి పొడుగాటి మనిషి పాపం వారం రోజులుగా తిరుగుతున్నాడు-

అతగాడు వరండాలో ప్రేము కుర్చీలో శవారం రోజులనుంచీ కూర్చుని కూర్చుని, ఓ నేతి డబ్బా పట్టుకొచ్చి, డ్రాయింగ్ రూంలో స్థానం సంపాదించాడు ఇవాళే.

అయ్యగారు కాఫీ త్రాగి పేపరు చూస్తూ డ్రాయింగ్‌రూమ్‌లో జనాన్ని పలకరించి, డ్రెస్ చేసుకుని "టైమైంది సాయంత్రం కలుద్దాం" అని వరండాలో వాళ్ళకి చెప్పేసి కారు ఎక్కి- వెళ్ళిపోతాడు.

ఆ పైన వరండాలో సభ్యులు అమ్మగార్ని కలుసుకుని, ఏవో వారికి తోచినరీతిని అమ్మగారిని సన్మానించి మరునాటి నుండి డ్రాయింగ్ రూంలో ప్రవేశం సంపాదిస్తారు.

ఏమిటో! చేసేది ఉద్యోగం ఆయనే అయినా, తనకీ లేనిపోని బాధ్యతలన్నీ వచ్చి పడుతున్నాయి- అందుకే రాజుకి ఇరవై నాలుగు గంటలు చాలడంలేదు- స్నానం, టాయిలెట్‌కి గంటైనా కావాలి- ఆ తరువాత ఆడ సింహాల క్లబ్బులోనో, స్త్రీల సమాజంలో ఏవో మీటింగులుంటాయి- ఆ పైన భోజనానికి ఇంటికి వస్తే. ఏ షాపింగుకో రమ్మని ఎవరో ఒకరు పిలుస్తారు. లేకపోతే తన షాపులోకి ఇంపొర్టెడ్ చీరెలొచ్చాయని బట్టల షాపువాడో, క్రొత్త నగలొచ్చాయని బంగారపు కొట్టు షరాబో ఫోను చేస్తాడు - అదీ ఇదీ లేకపోతే విజిటర్లు వస్తారు - కాఫీలు - టిఫిన్లు- కోకాకోలాలు - ఐస్‌క్రీంలు- ఎవరో పంపిన మామిడి పళ్లు ఇంకొకరికి పంపడం-ఏమిటో వెధవపన్లు-

సాయంత్రం ఎవరిదో పాఠశాల ప్రారంభోత్సవం- రిబ్బన్ కట్ - ఆ పైన సుశీలా నాగరాజు ఇంట్లో డిన్నర్ పార్టీ-

లేకపోతే తన ఇంట్లోనే ఎవరో డిన్నర్‌కి వస్తారు- వాళ్ళకోసం స్పెషల్స్ చేయించడం-స్వయంగా వడ్డించడం-

"ఏమిటండీ! ఇదంతా" అంటే, "మనం కట్టబోయే ఇంటికి కలపంతా ఫ్రీగా ఇస్తాడే శఖున-భోజనం అయినా పెట్టలేమా?" అంటాడు భర్త-

అంత గొప్పాయనకి నిజంగా పొట్టొట్టి భోజనం పెట్టడం ఎలా?

"స్కాచ్ అయినా ఇవ్వకుండా మరీ ముడిభోజనం పెట్టి పంపమన్నావా?"

అప్పుడుమరి తప్పుతుందా.

ఇలాగే ఏమిటో ప్రాణానికి సుఖంలేదు.

లాండ్రీవాడికి పది పట్టుచీరెలువేసి వారం రోజులైంది. ఫోనుమీద ఫోన్‌చేసినా తేడు. టెయిలర్ బట్టలు తీసుకువెళ్ళి మూడు నెలలై పోయింది. అసలు తీసుకువెళ్ళిన బట్టలు కూడా గుర్తులేవు.

ఒక్కమాటే ఇన్ని బియ్యం వద్దండీ అంటే వినకుండా పది బస్తాలు పడేయించాడు. ఎలికలు కొట్టేస్తున్నాయి. స్టోర్ రూంలో పాదం పెట్టేచోటులేదు- పల్లెటూరి పంట సంసారుల్లాగ కందులూ- మినుములూ బస్తాలలో ఎందుకు? ఎలికలూ, పని వాళ్ళూ సగం పట్టుకుపోతే తక్కిన సగం తినాలి- ఎన్నని చూసుకోవాలి! క్షణం తీరడంలేదు- ఈ మధ్య సుహాసినీ సూర్యారావు బొంబేనుంచి జపాన్ నైలెక్స్ చీరెలు తెచ్చింది- చూడ్డానికి రమ్మంటే రెండు రోజులనుంచీ తెమలడంలేదు. ఇంట్లో క్యాషెందుకు పెట్టుగోడం- ఏదైనా కొనమంటే కొంటే తప్పు పడతారంటాడు ఆయన. ఉద్యోగం పెద్దదైనమాత్రాన డబ్బు ఎవరికంటాపడకుండాఎన్నాళ్ళనిదాచుకోడం అందుకే నిరుడు రెండూ, ఈ ఏడు రెండూ బిస్కట్లు కొని పడేసింది—ఎన్ని నగలు చేయించినా, అన్నీ ఒకసారి పెట్టుకోడం. ఫ్యాషన్ కాదాయె! అన్నీ అందరికీ ఒక్కసారిగా చూపడం ఎలా ?

తీరని సమస్యలు సుగుణా సుబ్రహ్మణ్యంకి-మహిళా మండలిలో ఉపన్యాసం చేయాలి-ప్రారంభోత్సవంలో మాట్లాడాలి? వ్రాసిపెట్టే వాళ్ళని వెతుక్కోవాలి ముందు. కారు పంపమని ఫోన్‌చేసి గంటైంది. ఇంతవరకూ రాలేదు- పిల్లలు అసలు చెప్పిన మాట వినడం లేదు. రోజా బి. కాంప్లెక్సు బిళ్ళలు వేసుకోమంటే వేసుకోరు. అలమారల నిండా టానిక్కులు కొని పడేయడమేగాని త్రాగరు-

వారానికోసారి ఫామిలీ డాక్టర్ దగ్గరకు వెళ్ళి చెక్ చేయించుకోమంటే వెళ్ళారు-

ఇండియన్ డ్రింకులూ - సిగరెట్లూవాడి ఆరోగ్యం పాడుచేసుకో వద్దండీ అంటే ఆయన వినరు - స్కాచ్ విస్కీ- వంటికి మంచిది - ఫారెన్ సిగరెట్లు ఊపిరి తిత్తులకి హాని చేయవు - ఎవరైనా ఇస్తే తీసుకుంటాడుగానీ, కొనడానికి మనసొప్పదు.

ఏమిటో జీవితం. చాలా డల్‌గా మొనాటనస్‌గా అనిపిస్తోంది. ఈసారి సెలవులకి డార్జిలింగ్, అటూపైపు తిరిగి రావాలి. ఇండియాలో లైఫ్ ఏం బాపుండదు. చారుమతీ చెల్లారావు అదృష్ట వంతురాలు. దాని మొగుడికి ఎంబెసీలో పుద్యోగం దొరికి, అమెరికా ఎగిరి పోయింది - డెకోలాప్ వేసిన రోజ్‌వుడ్ మంచంమీద, ఫోమ్ పరుపుమీద పడుకున్న సుగుణా సుబ్రహ్మణ్యంఅసహనంగా అటూఇటూదొర్లింది.

అమ్మయ్యో, తెల్లవారుతోంది అప్పుడే!

★